క్లుప్తంగా

క్రీడాకారులకు అభినందన

కడప స్పోర్ట్స్ : కడపకు చెందిన హ్యాండ్‌బాల్ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించి రజత పతకాలు సాధించడం పట్ల జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి అభినందించారు. రాజస్థాన్ రాష్ట్రంలోని కరులిలో ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించిన 46వ జూనియర్ జాతీయ హ్యాండ్‌బాల్ బాలుర చాంపియన్‌షిప్‌లో ఏపీ జట్టుకు ప్రాతినిథ్యం వహించిన ఎస్. నాగేంద్ర, ఎం. గురువర్ధన్‌లు రజత పతకం సాధించారు. వీరిని డీఎస్‌డీఓ అభినందించారు. కార్యక్రమంలో డీఎస్ఏ హ్యాండ్‌బాల్ శిక్షకుడు అబ్దుల్ మునాఫ్ పాల్గొన్నారు.

శ్రీ సోమేశ్వరుని హుండీ సొమ్ము లెక్కింపు



ఆలయ హుండీ సొమ్మును లెక్కిస్తున్న అర్చకులు, అధికారులు

కడప కల్చరల్ : స్థానిక దేవునికడపలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయ హుండీ సొమ్మును గురువారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ కార్యనిర్వాహణాధికారి ఎ.శ్రీధర్ పర్యవేక్షణలో, సీకే దిన్నె ఏఓ పి.సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో 2023 అక్టోబరు నుంచి ఇప్పటి వరకు రూ. 66,847 లభించిందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పిచ్చయ్యమూర్తి, సుబ్రమణ్యం, విజయ్‌కుమార్, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

బెంగుళూరుకు తగినన్ని బస్సులు నడపాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజల రద్దీ మేరకు ఏపీఎస్ ఆర్టీసీ కడప నుంచి బెంగుళూరు నగరానికి తగినన్ని బస్సులు నడపాలని పలువురు ప్రయాణీకులు కోరుతున్నారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు మధ్య అధికంగా ప్రైవేటు బస్సులు తిరుగుతున్నాయని, ఇటు ఏపీఎస్ ఆర్టీసీ, అటు కర్ణాటక ఆర్టీసీలు తగినన్ని బస్సులు కడప నుంచి బెంగుళూరు, మదనపల్లె నుంచి బెంగుళూరు, రాయచోటి నుంచి బెంగుళూరుకు నడపాలని కోరుతున్నామన్నారు. ఈ విషయంగా ఆర్టీసీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వారు కోరారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్‌సీకి సంబంధించిన మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కడప ఎస్టీయూ భవన్‌లో జిల్లా ముఖ్య నాయకుల సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాష అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సుబ్రమణ్యం రాజు మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు బాలగంగిరెడ్డి, గురుకుమార్, దాదాపీర్, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీ సీతారాముల కల్యాణోత్సవం

కడప కల్చరల్ : కడప నగర పరిధిలోని పాలెంపల్లె సచివాలయం వద్ద శనివారం ఉదయం 10.00 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నామని పోతుల కంచమ్మ, చిన్న ఓబుల్‌రెడ్డి ట్రస్టు ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. పాలెంపల్లె, రూకవారిపల్లె, సాయిపేట, సమీప గ్రామాల ప్రజలు తప్పక ఈ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

నేడు నిరసన

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం బకాయిల చెల్లింపులో చేస్తున్న అలసత్వాన్ని నిరసిస్తూ యూటీఎఫ్ పిలుపు మేరకు ఈ నెల 19వ తేదీన కడప మహవీర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిరసన ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తెలిపారు. గురువారం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. చెవిలో పూలతో శుక్రవారం ఉదయం 10 గంటలకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

28న చిల్డ్రన్స్ హోం ప్రారంభం

కడప కల్చరల్ : కడప నగరం ఎన్జీఓ కాలనీలో ఈనెల 28వ తేదీన బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ హోం ఏర్పాటు చేస్తున్నామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మేరువ బాలాజీరావు తెలిపారు. సమాజంలో అనుకోని సంఘటనల వల్ల తల్లిదండ్రులు, చదువుకు దూరమైన బాలలకు అన్ని వసతులు కల్పించి విలువలతో కూడిన విద్యను అందించేందుకు ఈ హోంను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇలాంటి అవసరాలు గల బాలుర గురించి తమకు (98494 89206, 81420 47682) సమాచారం ఇవ్వాలని కోరారు.

అయోధ్య రామయ్య అక్షింతలు పంపిణీ

జమ్మలమడుగు : ఈనెల 22న అయోధ్యలో జరిగే రామయ్య విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా పట్టణంలోని కన్నెలూరు నేతాజీ నగర్‌లో అక్షింతలను పంపిణీ చేశారు. గురువారం రాత్రి స్థానిక రామాలయంలోని మహిళా సభ్యులు అక్షింతలు తీసుకుని ఇంటింటికి పంపిణీ చేశారు.

మార్మోగిన రామనామం



కడప నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న రామభక్తులు



ఊరేగింపుగా తీసుకువస్తున్న రాముడి విగ్రహం

కడప కల్చరల్ : అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ప్రతి జిల్లాలో ప్రచార ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం కడప నగరానికి హైదరాబాదు నుంచి శ్రీరామ భక్తుల ఆధ్వర్యంలో భారీ శ్రీరాముని విగ్రహాన్ని తీసుకొచ్చారు. నగర శివార్లలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయం వద్ద స్థానిక భక్తులు అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్టు స్థానిక ప్రతినిధులు ప్రచార కార్యక్రమాల ఐక్యవేదికతోపాటు హౌసింగ్‌బోర్డు శ్రీకోదండ రామాలయ భక్తబృందాలు ఘనంగా స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. శిరస్సుకు వస్త్రం చుట్టి ఉన్న శ్రీరాముని భారీ విగ్రహాన్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాహనంపై నగర వీధుల్లో భారీగా ఊరేగించారు. ఈ సందర్భంగా శ్రీరామ భక్తులు జై శ్రీరామ్ నినాదాలతో నగరంలో 21వ తేదీన జరగనున్న శ్రీరామ శోభాయాత్రకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. దాదాపు రెండు వేల మందికి పైగా భక్తులు పాల్గొన్న ఈ ర్యాలీ అల్మాస్‌పేట సర్కిల్, చిలకలబావి, చెన్నూరు బస్టాండు, వన్‌టౌన్ సర్కిల్, కృష్ణా సర్కిల్, శంకరాపురం మీదుగా చిన్నచౌకులోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయానికి చేర్చారు. ఈనెల 21వ తేదీన ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఈ విగ్రహాన్ని కొలువుదీర్చనున్నారు. ఈ కార్యక్రమంలో కడప నగరానికి చెందిన పలు ధార్మిక సంస్థలు, దేవాలయాల ప్రతినిధులు, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, శ్రీరామ భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలి

చెన్నూరు : 2024–2025 ఆర్థిక సంవత్సరానికిగాను గ్రామాల అభివృద్ధిపై పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్‌లు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ సభా భవనంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ అధ్యక్షతన అధికారులు, ప్రజా ప్రతినిధులకు మండలస్థాయి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీర్ల సురేష్‌యాదవ్ మాట్లాడుతూ మండల అధికారులు, సచివాలయ సిబ్బంది సమన్వయంగా గ్రామాలలో ఏయే సమస్యలు ఉన్నాయో వాటన్నింటినీ గుర్తించి సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే అధికారులు చెప్పినవి తప్పక పాటిస్తూ వాటన్నింటిని పరిగణలోకి తీసుకుని గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు అన్ని సమస్యలపైన, అన్ని పనులపైన ప్రణాళికలు సిద్ధం చేయాలని వారు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 సునీత, ఈఓపీఆర్డీ సురేష్‌బాబు, ఏపీఎం గంగాధర్, అంగన్వాడీ సూపర్వైజర్లు గురమ్మ, నాగరత్నమ్మ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్నాలజీని వినియోగించుకోవాలి

అట్లూరు : ప్రతి రైతు టెక్నాలజీని వినియోగించుకుని ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించి అధిక దిగుబడులను పొందాలని బద్వేలు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు మర్రిపాటి నాగరాజు తెలిపారు. గురువారం బద్వేలు వ్యవసాయ డివిజన్ కార్యాలయం ఆవరణలో రైతులతో సమావేశమై మాట్లాడారు. ఆన్‌డ్రాయిడ్ ఫోన్ వినియోగిస్తున్న ప్రతి రైతు రైతు భరోసా యూట్యూబ్ చానల్‌ను ఓపెన్ చేసి తద్వారా ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకోవాలని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. అలాగే ఈచానల్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలతో పాటు వాతావరణ సాంకేతికత తదిర పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవచ్చన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాల ద్వారా అగ్రికల్చర్ అసిస్టెంట్లు, హార్టికల్చర్ అసిస్టెంట్లు కూడా అవగాహణ కలిగిస్తారన్నారు. అనంతరం రైతులకు వారి సెల్ ఫోన్‌లలో వ్యవసాయ పరిజ్ఞానాన్ని ఎలా తెలుసుకోవాలో వివరించారు.

ఘనంగా గొబ్బెమ్మ నిమజ్జనం



రాజంపేట టౌన్ : గొబ్బెమ్మ ప్రతిమను ఊరేగిస్తున్న ప్రజలు



రాజంపేట టౌన్ : గొబ్బెమ్మ పాటలు పాడుతున్న మహిళలు

రాజంపేట టౌన్ : మండలంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం గొబ్బెమ్మ నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గొబ్బెమ్మ ప్రతిమలను పురవీధులు, గ్రామాల్లో ఘనంగా ఊరేగించారు. దారిపొడవునా మహిళలు గొబ్బెమ్మ పాటలను పాడుతూ సాగారు. యువకులు బ్యాండు నృత్యాలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. అలాగే పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చారు. పట్టణానికి చెందిన వారు గొబ్బెమ్మ ప్రతిమలను పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న హత్యరాల మడుగులో నిమజ్జనం చేయగా, గ్రామీణ ప్రాంతాల వారు తమకు సమీపంలో ఉన్న చెరువులు, నీటి కుంటల్లో నిమజ్జనం చేశారు. కనుమ పండుగ మరుసటి రోజు నుంచి నిత్యం మండల వ్యాప్తంగా కొన్ని గ్రామాల్లో గొబ్బెమ్మ నిమజ్జన వేడుకలు జరుగుతుండటంతో.. ఆయా గ్రామాలు, ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంటోంది. ఇదిలా వుంటే ఈ నెల 20, 21వ తేదీల్లో గొబ్బెమ్మ నిమజ్జన వేడుకలను పెద్ద ఎత్తున చేపట్టేందుకు అనేక గ్రామాలకు చెందిన ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కనుమ పండుగ మరుసటి రోజు నుంచి గ్రామాల్లో వారం రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

పుల్లంపేట : మండలంలోని తిప్పాయిపల్లిలో గురువారం గొబ్బెమ్మ అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. మహిళలు గొబ్బెమ్మ పాటలు పాడారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ముగ్గులో గొబ్బెమ్మను పెట్టి పసుపు, కుంకుమతో పూజలు చేశారు. అనంతరం గ్రామం అంతా తిరిగి గొబ్బెమ్మ పాటలు పాడుతూ అమ్మవారిని సాగనంపారు.

ఆదరణ కోల్పోని చెక్కభజనలు

- ఎక్కడ చూసినా దర్శనమిస్తున్న చెక్కభజనలు



చెక్కభజన చేస్తున్న కళాకారులు

పులివెందుల రూరల్ : సాంకేతిక పరిజ్ఞానంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్న నేపథ్యంలో ప్రాచీన కాలం నుంచి వస్తున్న చెక్కభజనలు ఆదరణ కోల్పోకుండా వస్తున్నాయి. నేటి కంప్యూటర్ యుగంలో కూడా పండుగలు, పర్వదినాలు, తిరుణాలలో, చల్లముద్ద వేడుకలు లాంటి కార్యక్రమాలలో గ్రామీణ ప్రాంతాల్లో ఈ చెక్కభన కార్యక్రమాలు కనిపిస్తూనే వున్నాయి. గజ్జెపూజ వంటి చెక్కభజనలు నేటికీ దర్శనమిస్తున్నాయి. ఎంతో ప్రాచీన కాలం నాటి చెక్కభజన గతంలో ఆదరణ కోల్పోయినా ప్రస్తుత కాలంలో వీటికి పూర్వ వైభవం లభిస్తోంది. గ్రామీణ ప్రాంతంలో చెక్కభజన గురువులను పిలిపించుకుని చెక్కభజన నేర్చుకుంటున్నారు. గజ్జెపూజకు చుట్టుపక్కల బంధుమిత్రులను పిలిపించుకుని గ్రామీణ ప్రాంతాలలో చెక్కభజన కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. పండుగలు, పర్వదినాలు కాకుండా తీరిక దొరికన సమయంలో గ్రామీణ ప్రాంతాలలో చెక్కభజన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. కళారంగానికి వన్నె తెచ్చిన చెక్కభజన నేటికి గ్రామీణ ప్రాంతాలలో కనిపిస్తుండటంతో చెక్కభజన కళాకారులు ఇప్పటికీ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చెక్క భజన కళాకారులకు తగిన గుర్తింపు ఇవ్వాలని కళాకారులు కోరుతున్నారు.



ఘనంగా ఉరుసు

జమ్మలమడుగు : అజ్మీర్ షరీఫ్ ఖాజా గరీబున్ నవాజ్ ఉరుసు మహోత్సవంను గురువారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పలగాడి వీధిలో ఉన్న ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీ రాఖాద్రీ ఆధ్వర్యంలో జెండా పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా పక్కీర్లతో మేళా నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి సయ్యద్ షా గౌస్‌పీరా ఖాద్రీ మాట్లాడుతూ అజ్మీర్ షరీఫ్ తమ మహిమల ద్వారా ఎంతో మందిని శిష్యులుగా తయారు చేసుకోవడంతోపాటు, ఇస్లాం బోధనలు ప్రజలకు వివరించి ప్రజలను సరైన దారిలో పెట్టే ప్రయత్నం చేశారన్నారు. ప్రతి వ్యక్తి సన్మార్గంలో నడవడం ద్వారా నిజాయతీ ధైర్యాన్ని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సయ్యద్‌షా తాహీర్‌పీరాఖాద్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటకం



పులివెందుల రూరల్ : చక్రాయపేట మండలంలోని సురభి గ్రామంలో పుట్టిన ఈ సురభి నాటకాలు దేశ వ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందుతున్నాయి. సంక్రాంతి పండు సందర్భంగా పులివెందులలోని గరండాల్ రివర్ ఫ్రంట్(రాణితోపు)లో గురువారం 6వ రోజు నాటక ప్రదర్శనను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. కళాకారులు తమ ప్రదర్శనతో విశేషంగా ఆకట్టుకున్నారు. ఆరు రోజుల పాటు నిర్వహించిన సురభి నాటకాలను పట్టణ ప్రజలు ఎంతో ఆనందంగా తిలకించారు.

ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలి



శాంతి స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలని విజయనగరం వీధిలోని ఓంశాంతి భవన్ ఇన్‌చార్జి బీకే శాంత పేర్కొన్నారు.

గురువారం ఓం శాంతి భవన్‌లో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడు బ్రహ్మబాబా 55వ పుణ్యతిథిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాచీన రాజయోగాను విస్తరింప చేసి విశ్వమానవ కళ్యాణానికి కృషి చేసిన మహానీయుడు బ్రహ్మబాబా అని చెప్పారు.

ఘనంగా యోగివేమన జయంతి వేడుకలు

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో ఉన్న యోగివేమారెడ్డి రెడ్ల అన్నదాన సత్రంలో గురువారం యోగివేమారెడ్డి జయంతి వేడుకలను నిర్వాకులు ఘనంగా జరుపుకున్నారు. జయంతి సందర్భంగా బ్రహ్మం భక్తులకు ప్రత్యేక అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్ల అన్నదాన సత్రం గౌరవ అధ్యక్షుడు చిన్న ఓబుల్‌రెడ్డి, అధ్యక్షుడు గంగిరెడ్డి, ఉపాధ్యక్షుడు భోగిరెడ్డి శశికాంత్‌రెడ్డి, గురివిరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పట్టాభిరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి. సిద్దారెడ్డి, సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

రసవత్తరంగా ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. ఈనెల 11 నుంచి ప్రారంభమైన ఈ పోటీలలో భాగంగా గురువారం జెఎన్‌టీయూ కళాశాలలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. మండలస్థాయిలో క్రికెట్ పోటీలకు 18 టీములు పాల్గొన్నాయి. ఇందులో ఫైనల్‌కు చిన్నరంగాపురం, సియోన్‌పురం టీములు చేరుకున్నాయి. ఈనెల 20వ తేదీన ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తామన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలను గురువారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాదు, కమిషనర్ నరసింహారెడ్డి, సివిల్ సప్లై డైరెక్టర్ గంగాధర్‌రెడ్డిలు పరిశీలించారు.

నేడు బి.మఠంలో దళితుల ర్యాలీ

బ్రహ్మంగారిమఠం: విజయవాడలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీఆర్ అంబేద్కర్ భారీ విగ్రహ ఆవిష్కరణ ప్రారంభ నేపథ్యంలో మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని దళితులు భారీ సంఖ్యలో ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

శుక్రవారం సాయంత్రం 3గంటలకు మఠం నాల్గురోడ్లు కూడలి నుంచి భారీ ర్యాలీ సాగుతుందన్నారు. పోలీస్ స్టేషన్ దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అక్కడనుంచి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో బహిరంగ సభ అనంతరం 5గంటలనుంచి విజయవాడలో ముఖ్యమంత్రి ప్రసంగం ను ప్రత్యక్షంగా దళితులు తిలకిస్తారని పేర్కొన్నారు.

జాతీయస్థాయిలో కడప యువకుడికి బహుమతి



అబ్దుల్ అజీజ్

వైవీయూ : కడప నగరం మోచంపేటకు చెందిన సయ్యద్ అబ్దుల్ అజీజ్ జాతీయ స్థాయిలో నిర్వహించిన 'భారతీయ ఛాత్ర్ సంసద్' లో జాతీయస్థాయిలో రెండోస్థానం లో నిలిచాడు. భారత యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో గత వారంలో పూణేలోని ఎంఐటీ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో 'భారతదేశంలో మహిళల భద్రత' అన్న అంశంపై ఈయన చక్కటి ఉపన్యాసం ఇవ్వడంతో ఈయనకు జాతీయస్థాయిలో రెండో బహుమతి లభించింది. కాగా ఈయన తిరుపతిలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో బీటెక్ చదువుతున్నాడు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జయప్రదం చేయండి

కడప కార్పొరేషన్: భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలోని స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్న గొప్ప కార్యక్రమాన్ని రాష్ట్రంలోని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

విగ్రహ ఏర్పాటు గొప్ప విషయం

కడప ఎడ్యుకేషన్: విజయవాడలో దళితుల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయమని జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పఠాన్ ఖాదర్‌బాష అన్నారు. గురువారం కడపలోని మట్టి పెద్దపులి వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. మనందరికీ సమాన హక్కులకు కల్పించిన అంబేడ్కర్‌కు అతిపెద్ద విగ్రహం నిర్మించడం చారిత్రాత్మకమన్నారు. విగ్రహావిష్కరణను ఒక పండుగలా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు గౌస్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా మహమ్మద్ రఫీ, కడప తాలూకా అప్‌గ్రేడ్ ఎస్ఐగా పి. చంద్రమోహన్ విధుల్లో చేరారు. ఎస్ఐ మహమ్మద్ రఫీ గతంలో టి. సుండుపల్లి, మన్నూరు, రాయచోటి ట్రాఫిక్, రాయచోటి అర్బన్, వీరబల్లి, ఎస్‌బి అన్నమయ్య జిల్లా, కర్నూలు తాలూకా పోలీస్‌స్టేషన్‌లలో పనిచేశారు. అలాగే ఎస్ఐ పి. చంద్రమోహన్ ముద్దనూరు అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా పనిచేస్తూ కడప తాలూకా ఎస్ఐగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఎస్ఐలు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో తమవంతుగా కృషి చేస్తామన్నారు.

పట్టు వస్త్రాల సమర్పణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈనెల 22న అయోధ్యలో జరగనున్న శ్రీ బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గురువారం బీజేపీ నేతలు జిల్లా వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణరెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా భారతీయులు ఎదురుచూసే కల నెరవేరే రోజు వచ్చిందన్నారు. దేశ ప్రజల ఆకాంక్ష నెరవేరే ఘట్టం ఈనెల 22వ తేది కళ్లముందు సాక్షాత్కారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి ఆదినారాయణరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, జంగం వెంకట సుబ్బారెడ్డి, విజయ్‌తోపాటు అసెంబ్లీ కన్వీనర్లు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

22న సెలవు ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్ : అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా జనవరి 22వ తేదిని పాఠశాలలకు సెలవుగా ప్రకటించాలని ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి కోరారు. ఈ విషయమై గురువారం డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ మునీర్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట్రామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాసులు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21న బ్రాహ్మణ చైతన్య సదస్సు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొత్త రాఘవేంద్ర స్వామి ఆలయ సమీపంలోని బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు బ్రాహ్మణ చైతన్య సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు కంబగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో బ్రాహ్మణులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.